"ఏంసార్! ఆ కట్టేమిటి?" అడిగాడు ప్రొడక్షను మేనేజరు హీరో కుడిచేతి మణికట్టుకున్న బేండేజ్‌ని చూసి.

"మొన్న నెల్లూరుదగ్గర అవుట్‌డోరు ముగించుకుని కారులో వస్తుంటే, దారిలో లారీ అడ్డుపెట్టి ఆరుగురు దొంగలు మమ్మల్ని చుట్టు ముట్టారు. చాలా అదృష్టం సమయానికి వెలకాల ఆర్టీసీబస్ రావటంవల్ల మా ప్రాణాలు దక్కాయి" చెప్పాడు హీరో చిరునవ్వుతో.

సంభాషణల రచయిత, నిర్మాత, దర్శకులకేసి చూశాడు. వచ్చే నవ్వుని దాచుకునే ప్రయత్నం ఏమాత్రం చేయకుండా

## ఆహ్వానం!

హాలీవుడ్‌నుంచి తెలుగు సినిమా ఇండస్ట్రీలో పనిచేసే కొందరు కథారచయితలకీ, రచయితలకీ, నిర్మాతలకీ ఆహ్వానం రావటం చాలామందిని ఆశ్చర్యపరచింది.

తెలుగు ఉగాది అమెరికాలోని ఆంధ్రులమధ్య జరుపుకోవలసిందిగా కోరుతూ నలుగురు నిర్మాతలని, నలుగురు కథారచయితలని, నలుగురు దర్శకులని హాలీవుడ్‌లోని అమెరికన్ మోషన్ పిక్చర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆ పన్నెండుమందికి ఉత్తరాలు రాసాడు వాళ్ళ రాకపోకల ఖర్చులు అమెరికాలో అయే ఖర్చులు అన్నీ తమ అసోషియేషన్ భరిస్తుందని రాసారు.

మద్రాసులో ఇది గొప్ప సంచలనాన్ని కలిగించింది. అధికంగా సినిమాలు తీసే దేశాలలో ప్రపంచంలో ఇండియాకి ఒక విశిష్ట స్థానము వుంది కాబట్టి ఆ గౌరవంతో పిలిచి వుంటారని, తెలుగులో సినిమాల

సంఖ్య అధికం కాబట్టి తెలుగువాళ్ళని పిలుస్తున్నారని కొందరు వూహించారు.

ఇలా అనేక రకాల వూహాగానాలు చేసారు. మద్రాసులోని అమెరికన్ కన్సులేట్ ఆ పన్నెండు మందికి ట్రావేల్ డాక్యుమెంట్సు లాంటివన్నీ ఓ ట్రావెలింగు ఏజెన్సీ సంస్థద్వారా ఏర్పాటు చేసింది

పన్నెండుమందికి పాన్ అమెరికన్ ఎయిర్‌లెన్ టిక్కెట్సు అందించింది. వాళ్ళకు వీడ్కోలు చెపుతూ కన్సులేటు ఆవరణలో ఒక మీటింగు మద్రాసు సినిమా పరిశ్రమ ఒక మీటింగు యేర్పాటు చేశారు. వాళ్ళని వాళ్ళ చిత్రాలని పొగడుతూ చాలామంది మాట్లాడారు

తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా చక్కటి సాంప్రదాయ సంగీతంతో సినిమాలు తీసిన దర్శక నిర్మాతలని అలాంటి వాటి కథారచయితలని అహ్వానించకపోవడం సముచితంగా లేదనికూడా కొందరు పెద్దలు మాట్లాడారు. కేవలం కమ్మర్షియల్ సినిమాలు తీసిన వారినే ఆహ్వానించడం అమెరికన్ పెట్టుబడి విధానాలకి దర్పణం అని ఒకరంటే, తెలుగులో కౌబోయ్ సినిమాలు, అమెరికన్ సమాజానికి దగ్గరగా వుండే కథాసంవిధానం గల సినిమాలు తీసినవారినే ఆహ్వానించడానికి కారణం వారిని అందకు అభినందించడానికే అని కొందరు అన్నారు.

చివరగా ఆహ్వానితులలో కొందరు మాట్లాడుతూ, ఈ గౌరవం కేవలం వ్యక్తిగతంగా తమది కాదని, ఇది తెలుగు కళామతల్లిదే అని వినయంగా మాట్లాడారు.

విమానంలో పన్నెండుమందీ బయలుదేరారు. ఆ విమానం లాస్ ఏంజెల్స్‌లో దిగింది వారిని రిసీవ్ చేసుకోవడానికి అమెరికన్ మోషన్ పిక్చర్స్ అసోషియేషన్స్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ వచ్చారు. పన్నెండు మందిలో ఆ ఇద్దరు కరచాలనం చేసి, వాళ్ళని కలవడం తమకు ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు.

కస్టమ్స్ క్లియరెన్స్ అయాక ఆ పన్నెండు మందిని బయటికి తీసుకెళ్ళారు. బయట ఆగివున్న రెండు కార్లలో ఎక్కారు పన్నెండుమంది.

కార్లు రెండు బయలుదేరాక వాళ్ళకి అనుమానం వచ్చింది. అవి టాక్సీలు కావు, స్వంతకార్లు కావు. అమెరికన్ ప్రభుత్వానికి చెందిన వో డిపార్టుమెంట్ కార్లు.

మద్రాసులో ఆ వార్త చిచ్చులా వ్యాపించింది. ఒక్క మద్రాస్ లోనే కాదు, తెలుగుదేశంలోనే కాదు, ఇండియా అంతటా. నిజానికి ప్రపంచంలోని అన్నిదేశాలలోని ప్రధాననగరాల నుంచి వెలువడే అన్ని వార్తాపత్రికలలో ఆ వార్తని ప్రముఖంగా ప్రచురించారు.

అమెరికాలో పన్నెండుమంది ఇండియన్స్ అరెస్టు.

ఆ వార్త ఇలా సాగింది.

లాస్ఏంజెల్స్ (21) ఇక్కడి అమెరికన్ మోషన్ పిక్చర్స్ అసోసియేషన్ భారతదేశంలోని వో ప్రాంతీయ భాష అయిన తెలుగు చిత్రసీమకి చెందిన నలుగురు నిర్మాతలని, నలుగురు దర్శకుల్ని, నలుగురు కథారచయితలని ప్రత్యేకించి తమ ఖర్చుతో ఆహ్వానించింది. లాస్ ఏంజెల్స్ ఎయిర్‌పోర్టునుంచే సరాసరి ఆ పన్నెండుమందిని పోలీస్ కార్లలో లాస్ఏంజెల్స్ క్రిమినల్ కోర్టుకి తీసుకెళ్ళారు. భారతదేశంలో విడుదలయిన అనేక అమెరికన్ చిత్రాల కథని యథాతథంగా కాపీకొట్టి ఈ నిర్మాతలు చిత్రాలని అనేకం లోగడ నిర్మించారు, ఈ విషయం ఈ అసోసియేషన్‌కి తెల్సి భారత ప్రభుత్వానికి రాసినా ఏం యాక్షన్ తీసుకోలేదు.

వీడియో కేప్‌లు వచ్చాక ఈ చౌర్యం అధికం అయింది ఇంకా భారతదేశంలో విడుదలవని అనేక హాలీవుడ్ సినిమాలని వీడియో కేసెట్స్ ద్వారా కాపీకొట్టి కథలు తయారుచేయడం ఇప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో అధికంగా జరుగుతోంది.

అమెరికన్ మోషన్ పిక్చర్స్ అసోసియేషన్ ఈ చౌర్యాన్ని ఎలా అరికట్టాలా అని ఆలోచించింది. కొన్నివేల వీడియో టేప్స్ భారతదేశం వెళ్ళకుండా ఆపడం అసాధ్యం కాబట్టి, వాటిని కాపీకొట్టే కొద్దిమంది మీద చట్టరీత్యా అమెరికాలో కాపీరైట్ ఏక్టు క్రింద చర్య తీసుకోవడం మంచి దనే నిర్ణయానికొచ్చారు అయితే అమెరికన్ క్రిమినల్ కోర్టుల జూరిస్ డిక్షన్ అమెరికా దేశానికే పరిమితం కాబట్టి వాళ్ళని ఆహ్వానం పేరిట అమెరికాకి రప్పించారు! వాళ్ళు రావడానికి వో రోజు ముందే కేసులని దాఖలు చేయడంతో అరెస్టు వారెంట్స్ పోలీసులు తీసుకున్నారు. వారు హాలీవుడ్ చిత్రాల ఆధారంగా నిర్మించిన తెలుగుసినిమా వీడియో టేప్‌లు కోర్టులో ప్రదర్శించి వాళ్ళ నేరాలని నిరూపించాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అమెరికన్ కాపీరైట్ యాక్టు క్రింద నేరాలు రుజువయితే ఒక్కొక్కరికీ పన్నెండేళ్ళదాకా శిక్ష పడవచ్చు.

కాపీ కొట్టాలనుకునే నిర్మాతలకి హెచ్చరికగా ఈ ప్రయత్నం చేస్తున్నామని అమెరికన్ మోషన్ పిక్చర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నారు.

# జిందాబాద్! జిందాబాద్!

హైదరాబాదులో బంజారాహిల్స్‌లో వున్న సినిమా స్టూడియోలలో అదొకటి. వో ఫ్లోర్‌లో షూటింగు కొద్ది సేపట్లో మొదలవబోతోంది.

తీయబోయే దృశ్యంలో నటించే నటీనటులు మేకప్ గదులలో మేకప్ చేయించుకుంటున్నారు. ఆ చిత్ర నిర్మాతకి అదే తొలి సినిమా అనుభవం. అదే ముహూర్తం షాట్ కూడా. దాంతో ఎక్సయిటింగ్‌గా కొద్ది పాటి పిరికితనంగా కూడా వుంది